- ఒరిజినల్ పేరుతో క్లోన్ వస్తువుల విక్రయం
- మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు


సైబరాబాద్ - విశాల భారతి

నకిలీ ఐఫోన్లు, ఆపిల్ వాచీలు, ఇయర్‌బడ్స్‌ను అసలైనవిగా నమ్మించి విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 1267/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నవంబర్ 7న అల్తమాష్ (26) అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట్ సైదనగర్‌లో నివాసం ఉంటున్న అతడు నకిలీ, క్లోన్ చేసిన ఐఫోన్లు, ఆపిల్ వాచీలు, ఇయర్‌బడ్స్‌ను ఒరిజినల్ వస్తువులుగా ప్రచారం చేస్తూ అమాయకులకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడి నుంచి రెండు ఐఫోన్లు (ఒకటి నకిలీది), నాలుగు నకిలీ ఆపిల్ వాచీలు, ఏడు నకిలీ ఇయర్‌బడ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసంలో ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఆవేష్ ఖాన్ కూడా భాగస్వామిగా ఉన్నట్లు గుర్తించగా, ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన అల్తమాష్‌ను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ మాదాపూర్ డివిజన్ మార్గదర్శకత్వంలో రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె. రామిరెడ్డి, క్రైమ్ సిబ్బంది ఈ కేసును ఛేదించారు. నిందితుడి అరెస్టులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు భారీ దరఖాస్తులు

మొదటిపేజీ తరువాయి

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో కలిపి ఏకంగా 12 లక్షల 69 వేల 761 దరఖాస్తులు అందడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇందులో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గం నుంచి 5 లక్షల 99 వేల 394 దరఖాస్తులు రాగా, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గం నుంచి 6 లక్షల 70 వేల 367 ఫామ్ 18లు అందాయి. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ గత ఎన్నికలతో పోలిస్తే దరఖాస్తులు పెరగడం గమనార్హం. 2021 ఎన్నికల సమయంలో మొదటి నియోజకవర్గంలో 5 లక్షల 76 వేల 462, రెండో నియోజకవర్గంలో 5 లక్షల 63 వేల 282 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అంటే ఈసారి ఓటరు నమోదుపై పట్టభద్రుల్లో ఆసక్తి పెరిగిందని ప్రాథమికంగా అర్థమవుతోంది. అయితే దరఖాస్తుల సంఖ్య పెరగడం ఒక ఎత్తయితే, వాటిలో ఎన్ని నిజమైన అర్హత కలిగిన ఓట్లుగా మారుతాయన్నది ఇప్పుడు కీలకంగా మారింది. జిల్లాలవారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో రంగారెడ్డి జిల్లా ముందంజలో ఉంది. ఈ ఒక్క జిల్లా నుంచే లక్షా 51 వేల 596 దరఖాస్తులు రావడం విశేషం. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లక్షా 41 వేల 808 దరఖాస్తులతో రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ నుంచి లక్షా 4 వేల 349 దరఖాస్తులు అందాయి. మరోవైపు మహబూబ్‌నగర్ నుంచి 45 వేల 611, నాగర్‌కర్నూలు నుంచి 43 వేల 667, వికారాబాద్ నుంచి 40 వేల 147 దరఖాస్తులు వచ్చాయి. వనపర్తి జిల్లాలో 29 వేల 155, జోగులాంబ గద్వాలలో 22 వేల 974, నారాయణపేటలో 20 వేల 87 దరఖాస్తులు నమోదయ్యాయి. ఈ గణాంకాలను గమనిస్తే హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పట్టణ, నగర ప్రాంతాల నుంచి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు ఎక్కువ స్పందన వచ్చినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో నమోదైన సంఖ్య ఈ నియోజకవర్గంలో పట్టణ ప్రాంతాల ప్రభావాన్ని స్పష్టంగా చూపిస్తోంది. అదే సమయంలో నారాయణపేటలో అత్యల్ప దరఖాస్తులు రావడం వెనుక జనాభా, పట్టభద్రుల సంఖ్య, ఓటరు నమోదు అవగాహన వంటి అంశాలు ఉండే అవకాశం ఉంది. ఇక వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గంలోనూ



దరఖాస్తుల ప్రవాహం భారీగానే ఉంది. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా నల్గొండ జిల్లా నుంచి లక్షా 14 వేల 525 దరఖాస్తులు అందాయి. ఖమ్మం జిల్లా లక్షా 9 వేల 971 దరఖాస్తులతో తర్వాతి స్థానంలో ఉంది. సూర్యాపేటలో 73 వేల 990, హనుమకొండలో 68 వేల 56, వరంగల్‌లో 66 వేల 957 దరఖాస్తులు వచ్చాయి. భద్రాద్రి కొత్తగూడెంలో 57 వేల 370, మహబూబాబాద్‌లో 53 వేల 718, యాదాద్రి భువనగిరిలో 49 వేల 789 దరఖాస్తులు నమోదయ్యాయి. జనగామ నుంచి 35 వేల 418, జయశంకర్ భూపాలపల్లి నుంచి 17 వేల 907, ములుగు నుంచి 15 వేల 337 దరఖాస్తులు అందాయి. అయితే ఈ నియోజకవర్గంలో అత్యల్పంగా సిద్దిపేట జిల్లా నుంచి కేవలం 7 వేల 329 దరఖాస్తులు మాత్రమే రావడం ప్రత్యేకంగా చర్చకు వస్తోంది. రెండు నియోజకవర్గాల గణాంకాలను కలిపి చూస్తే నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి వంటి జిల్లాలు ఓటరు నమోదు ప్రక్రియలో కీలక పాత్ర పోషించాయి. అయితే ఎక్కువ దరఖాస్తులు వచ్చినంత మాత్రాన ఎన్నికల్లో ఒక పార్టీకి అనుకూలంగా పరిస్థితులు ఉన్నాయని చెప్పలేం. పట్టభద్రుల ఓటింగ్‌లో ఉద్యోగాలు, నిరుద్యోగం, విద్య, ప్రభుత్వ విధానాలు, స్థానిక సమస్యలు వంటి అంశాలు ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇక్కడ అసలు ఆసక్తికరమైన అంశం దరఖాస్తుల సంఖ్యకు, ఇప్పటి వరకు ఆమోదం పొందిన ఓట్లకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసం. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 5 లక్షల 99 వేల 394 దరఖాస్తులు అందగా, ఇప్పటివరకు లక్షా 15 వేల 350 దరఖాస్తులే ఆమోదం పొందాయి. అంటే వచ్చిన దరఖాస్తుల్లో ఇంకా పెద్ద సంఖ్యలో పరిశీలన పూర్తికావాల్సి ఉంది. వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గంలో 6 లక్షల 70 వేల 367 దరఖాస్తులకు గాను 2 లక్షల 33 వేల 861 ఓట్లు మాత్రమే ఆమోదం పొందాయి. రెండు ప్రాంతాల్లోనూ పరిశీలన ప్రక్రియ వేగం పెరగాల్సిన అవసరం కనిపిస్తోంది. దరఖాస్తుల్లో ఏవైనా తప్పులు ఉన్నాయా, అవసరమైన విద్యార్హత పత్రాలు జత చేశారా, ఒకే వ్యక్తి నుంచి డూప్లికేట్ దరఖాస్తులు వచ్చాయా వంటి అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. అందువల్ల మొత్తం దరఖాస్తుల సంఖ్యను తుది ఓటర్ల సంఖ్యగా పరిగణించడం సరికాదు. ప్రస్తుతం ఉన్న గణాంకాలు నమోదు ప్రక్రియపై పట్టభద్రుల స్పందనను మాత్రమే తెలియజేస్తున్నాయి. చివరకు ఎంతమంది అర్హత పొందుతారన్నది పరిశీలన పూర్తయిన తర్వాతే స్పష్టమవుతుంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే దరఖాస్తుల గడువు ముగిసిపోయినప్పటికీ, ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం పూర్తిగా ముగిసిపోలేదు. ఈ నెల 25న గ్రాడ్యుయేట్ ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించనున్నారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. ఈ సమయంలోనూ అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. అయితే తుది జాబితా ప్రకటించిన తర్వాత కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు నిర్ణయించిన చివరి తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉంటుందని ఆయన వెల్లడించారు. దీంతో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన పట్టభద్రులకు మరో అవకాశం ఉన్నట్లయింది. మొత్తంగా చూస్తే ఈసారి రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో పెరిగిన దరఖాస్తులు ఎన్నికలపై ఆసక్తిని సూచిస్తున్నాయి. కానీ ఈ సంఖ్యలన్నీ ఆమోదం పొందిన ఓట్లుగా మారడం, తుది జాబితాలో ఎంతమంది నిలవడం, ఆ తర్వాత పోలింగ్‌లో ఎంతమంది పాల్గొనడం అనే అంశాలే అసలు ఎన్నికల చిత్రాన్ని నిర్ణయించనున్నాయి. పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ నుంచి మొదలైన ఈ పోటీ, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన పరిణామంగా మారే అవకాశం ఉంది.



ఒక మడి ఎండితే.. పంటలన్నీ ఎండినట్లా?

- అంజయ్య యాదవ్ ప్రచారంపై ఎమ్మెల్యే శంకర్ ఫైర్
- ఎల్లుండి మీ గ్రామానికే వస్తా.. పంటల పరిస్థితిపై ప్రజల సమక్షంలోనే తేల్చుకుందాం!
- రైతుల పేరుతో రాజకీయ ప్రచారం తగదు

విశాల భారతి, షాద్‌నగర్:

ఒకచోట ఒక మడి నీళ్లు లేక ఎండిపోతే నియోజకవర్గంలోని పంటలన్నీ ఎండిపోయినట్లు ప్రచారం చేస్తారా? అంటూ షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్‌పై ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతుల పంటలు ఎండిపోతున్నాయంటూ చేస్తున్న ప్రచారంలో నిజానిజాలు తేల్చేందుకు ఎల్లుండి తానే సంబంధిత గ్రామానికి వస్తానని, ప్రజల సమక్షంలోనే పంటల పరిస్థితిని పరిశీలించి వాస్తవాలు తేల్చుకుందామని సవాల్ విసిరారు. రైతుల సమస్యలను రాజకీయాలకు వాడుకోవద్దని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలని హితవు పలికారు. నందిగామ మండల కేంద్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్న బహిరంగ సభలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి అదనపు విద్యుత్ సరఫరా చేయించి రైతుల పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం వరి కోతలు కూడా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎక్కడో ఒకచోట ఉన్న సమస్యను చూపిస్తూ మొత్తం నియోజకవర్గంలో పంటలు ఎండిపోయినట్లు చిత్రీకరించడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తన సవాల్‌ను స్వీకరించి గ్రామానికి రావాలని, పంటల పరిస్థితిపై బహిరంగంగా చర్చిద్దామని అన్నారు. రైతుల పక్షాన నిలబడాల్సిన నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వారిని తప్పుదోవ పట్టించకూడదని వ్యాఖ్యానించారు. ఇదే సభలో మాజీ మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి కూడా శంకర్ ఘాటు ప్రశ్నలు సంధించారు. 80 వేల పుస్తకాలు చదివామని చెప్పుకునే మేధావులు పదేళ్ల పాలనలో పేదలకు ఎన్ని ఇళ్లు కట్టించి ఇచ్చారని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుల విషయంలోనూ గత పాలకులు రైతులకు ఆశించిన ప్రయోజనం చేకూర్చలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తూ పేదలకు ఇళ్లు అందిస్తోందని తెలిపారు. రైతుల పంటలపై చేస్తున్న ప్రచారమైనా, ప్రభుత్వ పథకాలపై చేస్తున్న విమర్శలైనా వాస్తవాల ఆధారంగా ఉండాలని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు.

పునాదికే పగుళ్లు.. రైల్వే నిర్మాణంలో నాణ్యతకు పాతర!

- గుండ్రాతిమడుగులో 85 గేట్ల సిగ్నల్ రూం నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం?
- పునాది కుంగినా పట్టించుకోని కాంట్రాక్టర్
- జేసీబీతో మట్టి తోసి లోపాలను కప్పిపుచ్చే యత్నం!
- పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎక్కడ?
- ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలి





మహబూబాబాద్ జిల్లా కురవి మండలం (విలేజ్)

గుండ్రాతిమడుగు రైల్వే భద్రతకు అత్యంత కీలకమైన సిగ్నల్ వ్యవస్థకు సంబంధించిన భవన నిర్మాణంలోనే నాణ్యతా ప్రమాణాలు మంటగలుస్తున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గుండ్రాతిమడుగు రైల్వే పరిధిలో 85 గేట్ల నిర్వహణకు సంబంధించి నిర్మిస్తున్న నూతన సిగ్నల్ రూం భవన నిర్మాణంలో పునాది దశలోనే లోపాలు బయటపడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయల



వ్యయంతో చేపట్టిన పనుల్లో పునాది కుంగిపోవడం నిర్మాణ నాణ్యతపై అనేక అనుమానాలకు తావిస్తోంది.

పునాది కుంగింది.. జేసీబీతో మట్టి తోశారు!

భవనానికి పునాదే ప్రాణం. అలాంటి పునాది నిర్మాణ దశలోనే కుంగిపోయినట్లు కనిపిస్తుండటంతో నిర్మాణ పనుల నాణ్యతపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. జరిగిన లోపాన్ని సాంకేతికంగా పరిశీలించి పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన కాంట్రాక్టర్, కుంగిన ప్రాంతంలో జేసీబీ యంత్రంతో మట్టిని తోసి కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పునాది లోపాన్ని సరిదిద్దకుండా పైపై చర్యలతో పనులు ముగిస్తే భవనం భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రైల్వే భద్రతతో చెలగాటమా?

85 రైల్వే గేట్ల నిర్వహణకు సంబంధం ఉన్న సిగ్నల్ రూం నిర్మాణం సాధారణ భవన నిర్మాణం కాదు. రైళ్ల రాకపోకలు, సిగ్నల్ వ్యవస్థ, ప్రయాణికుల భద్రతతో ముడిపడిన కీలక నిర్మాణం. ఇలాంటి భవనంలోనే పునాది నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పునాదిలో ఏ మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించారు? ఏ రకమైన నిర్మాణ సామగ్రిని వినియోగిస్తున్నారు? పునాది కుంగడానికి కారణాలేమిటి? సాంకేతిక నిపుణులతో పరిశీలించారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు కరువయ్యాయి.

అధికారుల పర్యవేక్షణ ఏమైనట్లు?

నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి నాణ్యతను నిర్ధారించాల్సిన రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ఎక్కడున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్ పనులపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయా? నాణ్యత కంటే బిల్లుల చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తున్నారా? అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

మట్టి కప్పితే లోపాలు మాయమవుతాయా?

పునాది కుంగిన అంశాన్ని తేలిగ్గా తీసుకుని మట్టితో సర్దుబాటు చేయడం ద్వారా నిర్మాణ నాణ్యతను నిర్ధారించలేరు. లోపాలను పూర్తిస్థాయిలో గుర్తించి, నిపుణుల సూచనల మేరకు పునాది పటిష్టతను నిర్ధారించిన తర్వాతే పనులు కొనసాగించాలి. లేదంటే భవిష్యత్తులో తలెత్తే ప్రమాదాలకు బాధ్యత ఎవరు వహిస్తారన్నది ప్రశ్నార్థకమే.

ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి!

గుండ్రాతిమడుగు సిగ్నల్ రూం నిర్మాణంపై రైల్వే ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర సాంకేతిక విచారణ చేపట్టాలి. పునాది కుంగిన ప్రాంతాన్ని నిపుణులతో పరిశీలించి, నిర్మాణ సామగ్రి నాణ్యత, పనుల కొలతలు, అంచనాలు, బిల్లులను తనిఖీ చేయాలి. నాణ్యతా లోపాలు నిర్ధారణ అయితే కాంట్రాక్టర్‌తో పాటు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి. విచారణ పూర్తయ్యే వరకు లోపభూయిష్ట నిర్మాణ పనులను కొనసాగించకుండా చూడాలి. ప్రజాధనంతో నిర్మించే భవనాలకు నాణ్యతే పునాది కావాలి.. నిర్లక్ష్యానికి కాంట్రాక్టు పేరుతో రక్షణ కల్పించకూడదు. రైల్వే భద్రతతో ముడిపడిన నిర్మాణంలో రాజీ పడితే సహించేది లేదని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

చంద్యా తండాలో నాటుసారా దందాపై పోలీసుల దాడి!

- విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు
- 5 లీటర్ల సారా స్వాధీనం
- 100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



కురవి, విశాలభారతి: మహబూబాబాద్ జిల్లా కురవి మండల పరిధిలో నాటుసారా అక్రమ తయారీ, విక్రయాలపై పోలీసులు కొరడా ఝళిపించారు. చంద్యా తండాలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఐదు లీటర్ల కాచిన నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అక్రమ తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కురవి ఎస్సై బి. సతీష్, పోలీసు సిబ్బంది కానిస్టేబుళ్లు 20, 922, 3876తో కలిసి చంద్యా తండా పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన భూక్య రాజు (50) నాటుసారా విక్రయిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న సుమారు రూ.2 వేల విలువైన ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అక్కడే అక్రమ సారా తయారీ కోసం నిల్వ ఉంచిన సుమారు 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై నిందితుడిపై క్రైమ్ నంబర్ 235/2026 కింద తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చట్టంలోని సెక్షన్ 7(ఎ) రెడ్ విత్ 8(ఇ) ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

జిల్లా స్థాయి NCSC పోటీల్లో ప్రతిభ కనబర్చిన గుమ్మడిదొడ్డి విద్యార్థులు



వాజేడు, విశాలభారతి : 32జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (NCSC-2026) జిల్లా స్థాయి పోటీల్లో ములుగు జిల్లా, వాజేడు మండలంలోని MPUPS GUMMADIDODDI CHLKA పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతిని సాధించారు. అంతేకాకుండా జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా నిలిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు M. హర్షవర్ధన్, M. జీవన్ తేజ రూపొందించిన “Grey Water to Green Garden” అనే సైన్స్ ప్రాజెక్ట్ న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల లో నీటి వృథాను అరికట్టడం, గ్రే వాటర్‌ను పునర్వినియోగించడం, పర్యావరణ పరిరక్షణ మరియు నీటి సంరక్షణపై విద్యార్థులు రూపొందించిన ఈ వినూత్న ప్రయోగం ప్రశంసలు అందుకుంది. జవహర్‌నగర్‌లోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఈ ఘనత సాధించారు. గైడ్ టీచర్ D. నాగార్జున ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూపొందించి ప్రదర్శించారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, ఉపాధ్యాయులను HM గిరిప్రసాద్,స్థానిక MEO శ్రీ వెంకటేశ్వర్లు అభినందించారు.

మునుగోడు మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు


- మండుల సత్యం బి ఆర్ఎస్ మునుగోడు మండల పార్టీ అధ్యక్షులు



మునుగోడు విశాలభారతి: మునుగోడు మండల ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు బిఆర్ఎస్ మునుగోడు మండల పార్టీ అధ్యక్షులు మండుల సత్యం ఈ సందర్భంగా మాట్లాడుతూ. చీకటిని పారద్రోలి వెలుగులు నింపే దీపావళి పండుగ ప్రతి ఇంట్లో ఆనందం, సంతోషం నింపాలని ఆకాంక్షించారు.ప్రతి ఒక్కరి జీవితంలో అజ్ఞానమనే చీకటి తొలగిపోయి జ్ఞానమనే వెలుగు వెలగాలని కోరారు.ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని, వ్యాపారులు, రైతులు, యువత అందరికీ ఈ దీపావళి మంచి కలిగించాలని తెలిపారు. పండుగను సురక్షితంగా, పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాలని, చిన్నారులు, పెద్దలు టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మునుగోడు మండలం ప్రతి కుటుంబానికి, ప్రతి గ్రామానికి తన తరపున, మండుల సత్యం తరపున హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

వినూత్నంగా దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ట్రినిటీ స్కూల్ విద్యార్థులు

- దీపావళి పండుగ విశిష్టత చీకటిపై వెలుగు సాధించిన విజయం
- ఉజ్జుని మంజుల,ట్రినిటీ పాఠశాలల ప్రిన్సిపల్ కం డైరెక్టర్



చౌటుప్పల్, విశాలభారతి: దీపావళి పండుగను పురస్కరించుకుని చౌటుప్పల్ లోని ట్రినిటీ స్కూల్ విద్యార్థులు వినూత్నంగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.వందలాది మంది విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో నేలపై దీపం ఆకారంలో కూర్చున్నారు.దీపం చుట్టూ వలయాకారంలో కూర్చుని, ‘హ్యాపీ దివాళీ’ అనే అక్షరాలను ఆవిష్కరించారు. విద్యార్థులు దీపం ఆకారంలో, హ్యాపీ దివాళీ అక్షరాల రూపంలో కూర్చుని చేసిన ఈ వినూత్న ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా శ్రీనిధి పాఠశాల ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ,దీపావళి పండుగ విశిష్టతను వివరిస్తూ చీకటిపై వెలుగు సాధించిన విజయాన్ని గుర్తుగా దీపావళి పండగను జరుపుకుంటారని గుర్తుజేశారు.పాఠశాల ప్రాంగణం దీపాల వెలుగులతో రంగురంగుల అలంకారణలతో కళకళలాడింది. ఉపాధ్యాయినీలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని టపాసులు కాల్చుతూ చిచ్చుబుడ్డిలు వెలిగిస్తూ సందడి చేశారు. చిన్నారులు దీపాలను చేత పట్టుకుని దీపావళి శుభాకాంక్షలు తెలిపారు పాఠశాలలో ఏర్పాటుచేసిన హ్యాపీ దీపావళి డిస్ప్లే బోర్డు ముందు ఉపాధ్యాయులు,విద్యార్థులు దీపాలతో ఫోటోలు దిగారు.అందరూ ఒకరికొకరు దీపావళి శుభాకాంక్షలు ఫోటో వేడుకను ఆనందంగా జరుపుకున్నారు.

కోదాడ మార్కెట్ అభివృద్ధి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్



కోదాడ: విశాల భారతి:రాష్ట్ర భారీ నీటు పారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిల సలహాలు సూచన సహకారం పాలకవర్గ సభ్యుల తో కలిసి కోదాడ వ్యవసాయ మార్కెట్ సంత ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తున్నట్లు కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరపతమ్మ సుధీర్ ఉన్నారు శుక్రవారం మునగాల మండలం బరాకత్ గూడెం లో వ్యవసాయ మార్కెట్ కు సంబంధించిన చెక్ పోస్ట్ ను తనిఖీ చేశారు అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ నియోజకవర్గం నుండి ధాన్యం కొనుగోలు చేసి లారీల పైన వెళ్లే వాహనదారులు చిమిర్యాల బాలాజీ నగర్ బరాకత్ గూడెం దగ్గర ఏర్పాటుచేసిన మార్కెట్ చెక్ పోస్ట్ ల వద్ద చెస్ కట్టి మార్కెట్ జరిగే అభివృద్ధికిసహకరించాలని కోరారు. కోదాడ మార్కెట్ లో శనివారం ఆదివారం గొర్లు పశువుల సంత కు వచ్చి పోయే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మంత్రి ఎమ్మెల్యేల సలహాలు సూచనలతో తాగునీరు పరిశుభ్రత కల్పించి ప్రశాంతంగా రైతులు వ్యాపారస్తులు వచ్చి వ్యాపారాలు చేసుకునే విధంగా కఠినమైన నిర్ణయాలు తీసుకున్నామని గతంలో సంతలో దళారుల వ్యవస్థ ఉండేదని ఇప్పుడు సంతలో దళారుల వ్యవస్థ లేకుండా నేరుగా కొనుగోలుదారుడు అమ్మకాదారుడుకి వచ్చి సజావుగా వ్యాపారాలు చేసుకునే విధంగా చేసేమన్నారు. కార్యక్రమంలో మునగాల మండల పార్టీ అధ్యక్షుడు డైరెక్టర్ కాసర్ల కోటయ్య చిలుకూరు మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతు జిల్లా కార్యదర్శి సామేలు నడిగూడెం మండలం మాజీ వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు మునగాల మండల యూత్ అధ్యక్షుడు తక్కెళ్ళ సాయి నాగుల్ పాషా మహమూద్ రియాజ్ స్థానికులు యువకులు తదితరులు ఉన్నారు

సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డుకు నో.. మంత్రి కీలక ప్రకటన

- ప్రజల ఆందోళనలకు తెర.. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయబోమని స్పష్టీకరణ
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టుదలకు మంత్రి ప్రశంసలు



విశాల భారతి, షాద్‌నగర్: సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ప్రతిపాదనపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక ప్రకటన చేశారు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో మంత్రి చేసిన ఈ ప్రకటనతో సిద్ధాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు భారీ ఊరట లభించింది. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నామని, ఈ విషయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా ముఖ్య మంత్రి, తన దృష్టికి సమస్యను తీసుకొచ్చి డంపింగ్ యార్డు ప్రతిపాదనను నిలిపివేయాలని కోరినట్లు మంత్రి వెల్లడించారు. జేపీసీ నాయకులు పిసపాక ప్రభాకర్, అంబటి ప్రభాకర్, శేఖర్ రెడ్డి తదితరులు రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆందోళనలను తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు.

అభివృద్ధే ధ్యేయం..

పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నందిగామ మండలంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గానికి సుమారు రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమీకృత పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల ఆర్థిక సాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, భూ సమస్యల పరిష్కారానికి భూధార్ విధానాన్ని తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై ప్రశంసల జల్లు..

ఇదిలా ఉండగా,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పనితీరుపై మంత్రి ప్రశంసలు కురిపించారు.నియోజకవర్గ అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు పట్టువదలకుండా కృషిచేసే నాయకుడని, నిధులు, అనుమతుల కోసం ముఖ్యమంత్రి వద్దైనా, తన వద్దైనా పట్టుబట్టి సాధించుకుంటారని కొనియాడారు. బతుకమ్మ చీరల పంపిణీలో గత ప్రభుత్వానికి భిన్నంగా తమ ప్రభుత్వం నాణ్యమైన చీరలు అందించిందని, త్వరలో చిలకపచ్చ రంగు చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయబోమన్న మంత్రి ప్రకటనతో స్థానికంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడినట్లయింది.

మాటల్లో కాదు.. చేతల్లో చూపిన సమానత్వం

- దళిత నాయకుడి ఇంట్లో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే శంకర్ సహపంక్తి భోజనం
- కులవివక్షకు తావులేని సమాజమే కాంగ్రెస్ లక్ష్యం
- దళితులు బలంగా ఉంటేనే సమాజం బలంగా ఉంటుంది
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణ ఇంట్లో తింటున్న మంత్రి శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

విశాల భారతి,షాద్‌నగర్: సమానత్వం గురించి ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ఆచరణలోనూ చూపించారు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్...కులమతాలకతీతంగా అందరూ సమానమేనని చాటుతూ నందిగామ మండల కేంద్రంలోని దళిత కాంగ్రెస్ నాయకుడు, గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణ ఇంట్లో ఇరువురు నేతలు సహపంక్తి భోజనం చేశారు. అంటరానితనం,కులవివక్ష వంటి సామాజిక రుగ్మతలు ఇంకా అక్కడక్కడా కనిపిస్తున్న తరుణంలో దళిత నాయకుడి ఇంటికి వెళ్లి భోజనం చేయడం ద్వారా సామాజిక సమానత్వానికి బలమైన సందేశమిచ్చారు. కొమ్ము కృష్ణ దంపతులు స్వయంగా వండిన వంటకాలను ఆప్యాయంగా వడ్డించగా, మంత్రి, ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులతో కలిసి భోజనం చేశారు. దళితవాడలో దళిత నాయకుడి ఇంట్లో భోజనం చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని మంత్రి పొంగులేటి ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కులం, మతం, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా మనుషుల మధ్య వివక్ష చూపడం సరికాదన్నారు. అన్నమయ్య సంకీర్తనలో చెప్పినట్లుగా రాజైనా, సామాన్యుడైనా, బ్రాహ్మణుడైనా, చండాలుడైనా అందరిలోనూ పరబ్రహ్మ స్వరూపం ఒక్కటేనని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం దక్కాలని, కులవివక్షకు తావులేని సమాజ నిర్మాణమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, ముఖ్యంగా దళితుల సామాజిక,ఆర్థిక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.దళితులు బలంగా ఉంటేనే సమాజం బలంగా ఉంటుంది అని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. వారి అభివృద్ధితోనే సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దళితులను ఉపయోగించుకోవడం కాకుండా,వారి అభ్యున్నతిని నిజంగా ఆకాంక్షిస్తూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.రాజకీయ నాయకుల మాటల్లోనే కాకుండా వారి చేతల్లోనూ సమానత్వ భావన ప్రతిబింబించాలని, నందిగామలో జరిగిన ఈ సహపంక్తి భోజనం కులవివక్షకు వ్యతిరేకంగా, సామాజిక సమానత్వానికి అనుకూలంగా మంచి సందేశాన్ని ఇచ్చిందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.

మిల్లు యజమాని నిర్లక్ష్యానికి రైతు బతుకు బలి



- మిల్లు చుట్టూ మోరం పోసి సహజ నీటి ప్రవాహానికి అడ్డుకట్ట
- చిన్నపాటి వర్షా నికే మిర్చి తోటలు జలమయం.. రైతు కంట కన్నీరు
- గ్రామపంచాయతీకి, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?
- రాజకీయ పలుకుబడి ఉంటే రైతు పాలాలను ముంచినా పట్టించుకోరా?
- పంట నష్టానికి పరిహారం చెల్లించాలని సింగం వెంకటరమణ డిమాండ్

కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; మిల్లు నిర్మాణం ఒకరి వ్యాపారానికి ఉపయోగపడితే.. అదే నిర్మాణం మరో రైతు పంటను ముంచడానికి కారణం కావాలా? తన భూమిలో పంట పండించుకునే హక్కు రైతుకు లేదా? సహజంగా ప్రవహించాల్సిన వర్షపు నీటికి అడ్డుకట్ట వేసి రైతు పొలాలను ముంపులోకి నెట్టారనే ఆరోపణలు గుండ్రాతిమడుగు గ్రామంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కలిసి తన మిర్చి పంటను దెబ్బతీస్తున్నాయని రైతు సింగం వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు (వి) గ్రామంలో మిల్లు నిర్మాణం కారణంగా వర్షపు నీటి సహజ ప్రవాహానికి అటంకాలు ఏర్పడ్డాయని రైతు ఆరోపిస్తున్నారు. మిల్లు చుట్టూ మోరం పోసి ఎత్తు పెంచినప్పటికీ, నీరు బయటకు వెళ్లేందుకు సరైన కాలువ ఏర్పాటు చేయలేదని పేర్కొంటున్నారు. దీంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి తన మిర్చి తోటల్లోకి చేరుతోందని, పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నానని వాపోతున్నారు. గతంలోనూ ఇదే పరిస్థితి ఎదురైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని చెబుతున్నారు.

రైతు ఫిర్యాదులకు విలువ లేదా?

సమస్యను పలుమార్లు మిల్లు యజమాని దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేశారు.. పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.. అయినా సమస్య మాత్రం అక్కడే నిలిచిపోయింది. రైతు పొలాల్లో నీరు నిలుస్తున్నా అధికార యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతోనే మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందా? అనే అనుమానాన్ని రైతు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

నిర్మాణానికి అనుమతులున్నాయా?

* నీటి మార్గాన్ని మూసివేసే అధికారం ఎవరిచ్చారు?

మిల్లు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, మోరం పోసిన విధానం, సహజ నీటి ప్రవాహానికి ఏర్పడిన అడ్డంకులపై సమగ్ర విచారణ జరగాలి. నిర్మాణాల వల్ల ఇతరుల వ్యవసాయ భూములకు ముంపు ప్రమాదం కలిగితే సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలి. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. వ్యాపార ప్రయోజనాల కోసం రైతు సాగుభూమి నష్ట పోవాల్సిన పరిస్థితి రావడం ఎంతవరకు సమంజసమన్నది అధికారులే తేల్చాలి.

అధికారులారా.. రైతు కన్నీళ్లు కనిపించడం లేదా?

జిల్లా పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే గుండ్రాతిమడుగు గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. సహజ నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించి, శాశ్వతంగా నీరు వెళ్లేలా కాలువ ఏర్పాటు చేయాలి. ఇప్పటికే దెబ్బతిన్న మిర్చి పంట నష్టాన్ని అంచనా వేసి రైతుకు న్యాయమైన పరిహారం అందించాలి. బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఒక రైతు ఫిర్యాదును పరిష్కరించడానికి ఇన్ని రోజులు కావాలా? పంట మునిగిపోయాక పరిశీలనలు, పంట చేతికొచ్చాక హామీలు ఇచ్చి ప్రయోజనం ఏమిటి? రాజకీయ పలుకుబడి ఎంత ఉన్నా నిబంధనలకు మినహాయింపు ఉండకూడదు. రైతు భూమి, రైతు పంట, రైతు హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానిదే. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రైతుకు న్యాయం చేయాలని సింగం వెంకటరమణ డిమాండ్ చేస్తున్నారు.

జనగామ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- బబ్బుర్ శ్రీకాంత్ గౌడ్ జనగాం జిల్లా నాయకులు



జనగాం విశాల భారతి ; జనగామ జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు జనగామ జిల్లా నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ఈ సందర్భంగా మాట్లాడుతూ. చీకటిని పారద్రోలి వెలుగులు నింపే దీపావళి పండుగ ప్రతి ఇంట్లో ఆనందం, సంతోషం నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో అజ్ఞానమనే చీకటి తొలగిపోయి జ్ఞానమనే వెలుగు వెలగాలని కోరారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని, వ్యాపారులు, రైతులు, యువత అందరికీ ఈ దీపావళి మంచి కలిగించాలని తెలిపారు. పండుగను సురక్షితంగా, పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాలని, చిన్నారులు, పెద్దలు టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి కుటుంబానికి, ప్రతి గ్రామానికి తన తరపున, గబ్బుర్ శ్రీకాంత్ గౌడ్ తరపున హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

చౌటుప్పల్ మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- సరికొండ సారయ్య,చౌటుప్పల్ మందుల సంఘం అధ్యక్షులు



చౌటుప్పల్,విశాల భారతి: చౌటుప్పల్ మండల ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు చౌటుప్పల్ మండల మందుల సంఘం అధ్యక్షులు సరికొండ సారయ్య. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చీకటిని పారద్రోలి వెలుగులు నింపే దీపావళి పండుగ ప్రతి ఇంట్లో ఆనందం, సంతోషం నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో అజ్ఞానమనే చీకటి తొలగిపోయి జ్ఞానమనే వెలుగు వెలగాలని కోరారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని, వ్యాపారులు, రైతులు, యువత అందరికీ ఈ దీపావళి మంచి చేస్తుందని తెలిపారు. పండుగను సురక్షితంగా, పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాలని, చిన్నారులు, పెద్దలు టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండలంలోని ప్రతి కుటుంబానికి, ప్రతి గ్రామానికి తన తరపున, మండుల సంఘం తరపున హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

‘మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి’ కార్యక్రమానికి ఎంపీడీవో, కార్యదర్శి లింకు ఘనంగా ఆహ్వానం

- భూక్య గోపానాయక్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేసిన కాంగ్రెస్ నాయకులు




కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; ప్రజా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించనున్న ‘మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి’ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ, బంగారిగూడెం గ్రామపంచాయతీల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కి బంచరాయితండ గ్రామ పంచాయతీ కార్యదర్శి కీ మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఎస్టీ సెల్ కురవి మండల అధ్యక్షుడు భూక్య గోపానాయక్ ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలను నిర్వహించాలనే ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో పాల్గొని వేడుకలను మరింత ఘనంగా నిర్వహించాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేసి అధికారికంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు లూనావత్ విజయ్ నాయక్, బాదావత్ రంజిత్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ లూనావత్ సేట్యా నాయక్, సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రామారావు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో నుంచి రక్షణకు,శ్రీ సోమనాథ క్షేత్రంలో మహా మృత్యుంజయ యాగం



చౌటుప్పల్,విశాలభారతి: ఎల్ నినో మూలంగా ఏర్పడిన వర్షాభావం, కరవు పరిస్థితుల నుంచి కాపాడాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షిస్తూ చౌటుప్పల్ లోని శ్రీ సోమనాథ క్షేత్రంలో మహా మృత్యుంజయ యాగం శనివారం నిర్వహించారు. వేదమూర్తులచే శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ యజ్ఞంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్షేత్రంలోని శ్రీ సోమనాథ మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి సమర్పించారు. భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సోమనాథ క్షేత్రం చౌటుప్పల్ కమిటీ అధ్యక్షుడు బడుగు నరసింహ, గౌరవాధ్యక్షుడు అప్పిడి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి గట్టు ప్రభాకర్, రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మేక మృతి



దేవరుప్పుల విశాలభారతి: మండలం రాజీవ్ నగర్ గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడంతో బండి నవీన్ తండ్రి లింగయ్య కు చెందిన మేక మృతి చెందింది నిండా చూలుతో ఉన్న మేక విలువ సుమారు 25000 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ఈ ఘటనతో రైతుకు ఆర్థిక నష్టం వాటిల్లింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి బాధిత రైతుకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

నిర్ణీత గడువులో భూ రీ సర్వే పూర్తి చేయాలి

- అధికారుల నిర్లక్ష్యానికి తావులేకుండా వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; జిల్లాలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత లక్ష్యంలోపు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల్లో జాప్యం జరగకుండా ప్రభుత్వ, లైసెన్సుదు సర్వేయర్లు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, సహాయ సంచాలకులు భూ రికార్డులు, సర్వేయర్ శ్రీనివాసులుతో కలిసి జిల్లా కలెక్టర్ భూ రీ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 23 గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొదటి దశలో మహబూబాబాద్, కురవి, బయ్యారం, గార్ల, డోర్నకల్, నెల్లికుదురు, తొర్రూరు, కేసముద్రం, గూడూరు, దంతాలపల్లి, పెద్దవంగర మండలాల్లోని 11 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతుండగా, రెండో దశలో ఇదే 11 మండలాలతో పాటు మరిపెడ, ఇనుగుర్తి మండలాల్లోని మొత్తం 12 గ్రామాల్లో సర్వే పనులు నిర్వహిస్తున్నారు. ఈ 23 గ్రామాల్లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే ప్రక్రియను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూ రికార్డుల ప్రక్షాళన, భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో రీ సర్వే కీలకమైనందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో భూ సర్వే ఇన్‌స్పెక్టర్లు సురేందర్, సర్వేయర్లు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు.. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

- గిరిజనుల చిరకాల డిమాండ్‌కు గుర్తింపు..
- తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు: బానోత్ బిక్షం నాయక్



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చట్టం-2003ను రద్దు చేస్తూ 2026లో నూతన చట్టం తీసుకువచ్చి ఎస్సీ, ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ గిరిజన సమైక్య హర్షం వ్యక్తం చేసింది. ఇది గిరిజన సంఘాలు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటానికి గుర్తింపుగా నిలుస్తుందని తెలంగాణ గిరిజన సమైక్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బానోత్ బిక్షం నాయక్ అన్నారు. ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్ల ఏర్పాటు చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. గిరిజన సంఘాల చిరకాల డిమాండ్‌ను గుర్తించి ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల గిరిజన సమాజం కృతజ్ఞతతో ఉంటుందని అన్నారు. ప్రత్యేక కమిషన్ ఏర్పాటు వల్ల గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత పెరిగి, సమస్యలకు సత్వర పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో ఉమ్మడి కమిషన్ ఉండటం వల్ల గిరిజనుల సమస్యలకు తగిన ప్రాధాన్యత లభించలేదని, అందుకే ప్రత్యేక ఎస్టీ కమిషన్ కోసం గిరిజన సంఘాలు అనేక సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహించాయని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ పోరాటానికి ఫలితం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటుతోనే సరిపెట్టుకోకుండా సమాజంలో వివక్షకు గురవుతున్న గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రాజకీయ, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన జాతి ఆత్మగౌరవంతో, సమాన హక్కులతో జీవించే పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని బానోత్ బిక్షం నాయక్ కోరారు.

నారాయణ NPLలో హయత్‌నగర్ బ్రాంచ్ ఛాంపియన్


- వనస్థలిపురం జోన్‌లో క్రీడా ప్రతిభ చాటిన విద్యార్థులు.. ట్రోఫీ అందజేత



విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్: నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ (NPL) ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో హయత్‌నగర్ బ్రాంచ్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి వనస్థలిపురం జోన్ ఛాంపియన్‌గా నిలిచారు. చదువుతో పాటు క్రీడారంగంలోనూ తమ ప్రతిభను చాటుకుంటూ ఘన విజయాన్ని సాధించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో కబడ్డీ, క్రికెట్, త్రోబాల్, డాడ్జ్‌బాల్, రన్నింగ్, చెస్ తదితర క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో, క్రమశిక్షణతో, పట్టుదలతో పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వ్యక్తిగత ప్రతిభతో పాటు జట్టు స్ఫూర్తి, సమన్వయంతో ఆడుతూ హయత్‌నగర్ బ్రాంచ్ విద్యార్థులు జోన్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం గోపాల్ రెడ్డి, వనస్థలిపురం ఏజీఎం రవీంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఛాంపియన్‌గా నిలిచిన హయత్‌నగర్ బ్రాంచ్ విద్యార్థులకు ట్రోఫీని అందజేశారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ విజేతలకు, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం విద్యార్థుల కృషితో పాటు క్రీడా శిక్షకుల మార్గదర్శకత్వం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, పాఠశాల యాజమాన్యం సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య రెడ్డి, మానస, హైస్కూల్ ఆర్ఎండీ శివరంజని, ఎన్పీఎల్ ఇన్‌చార్జి రోహిణి, ఈ ఛాన్స్ ఆర్‌అండ్‌డీ మహేశ్వరి, ఈ కిడ్స్ ఆర్‌అండ్‌డీ మీనా, స్పోర్ట్స్ ఆర్పీ సురేష్, సాఫ్ట్ స్కిల్స్ జాజిరెడ్డి, హైస్కూల్ కోఆర్డినేటర్ సృజన్, ఈ ఛాన్స్ కోఆర్డినేటర్ దివ్య, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ ప్రియాంక, ఏడీ మంజుల, ఈ ఛాన్స్ పీపీ కవిత, ఈ కిడ్స్ పీపీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంపొందుతాయని ఈ విజయం మరోసారి చాటిచెప్పింది.

రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తాం

- ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురపాటి బ్రహ్మయ్య మాదిగ



ముషీరాబాద్,విశాల భారతి: ఉస్మానియా యూనివర్సిటీలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) ఆధ్వర్యంలో మాదిగల సదస్సు నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమానికి ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ, జాతీయ అధ్యక్షులు డాక్టర్ సంద్రు నరసింహారావు మాదిగ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మానికొండ శ్రీధర్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రజా సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశంలో దళితులు, మైనారిటీల హక్కులకు భంగం కలగకుండా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత మూడు దశాబ్దాలుగా సామాజిక న్యాయం, రిజర్వేషన్ల సాధన కోసం యువత సాగిస్తున్న ఉద్యమాలకు ఎంఆర్పీఎస్ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తుందన్నారు. ప్రజా సంస్థలు, స్వతంత్ర వ్యవస్థల పరిరక్షణ కోసం పోరాడుతున్న యువతకు అండగా నిలుస్తామని తెలిపారు.భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడంతో పాటు సామాజిక న్యాయం సాధించేందుకు ఉద్యమాలు మరింత బలోపేతం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చాగంటి రాములు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు సమర్పించిన ఒడిబియ్యంతో మహా అన్నదానం

- చీరల వేలంపాటలో మహిళల సందడి,లక్కీ డ్రాలో చేనేత పట్టు చీర,పట్టు శాలువా విజేతలు



చౌటుప్పల్,విశాలభారతి: పట్టణంలోని శ్రీ మార్కండేయ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ దుర్గామాత అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. నవరాత్రుల్లో మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించిన ఒడిబియ్యాన్ని అన్నప్రసాదంగా తయారుచేసి పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా దుర్గామాత ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పెద్ది కృష్ణ, గోశిక బలరాజు, సూరేపల్లి శివ, ఉత్సవ అధ్యక్షులు గోలి శ్రీను, ప్రధాన కార్యదర్శి బత్తుల యశ్వంత్ మాట్లాడుతూ, అమ్మవారికి నవరాత్రుల్లో సమర్పించిన ఒడిబియ్యంతో అన్నదానం చేపట్టడం పవిత్రమైన సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. అన్నిదానాల్లో అన్నదానానికి విశిష్టమైన స్థానం ఉందని, అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భక్తిభావం, పరస్పర ఐక్యత, సేవాదృక్పథం పెరుగుతాయని, ఈ సంప్రదాయాన్ని ఏటా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీ మార్కండేయ దేవాలయ అధ్యక్షులు బడుగు జయప్రకాశ్ ప్రధాన కార్యదర్శి గోశిక బాలనర్సింహ ధర్మకర్తలు, దేవస్థాన కమిటీ సభ్యులు, పద్మశాలి యువజన సంఘం సభ్యులు, చేనేత సహకార సంఘం సభ్యులు, భావనారుషి కళానికేతన్ సభ్యులు, దుర్గామాత దీక్షా భక్తులు, మాతృమండలి సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారి చీరల వేలంపాటలో మహిళల ఉత్సాహం

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా భక్తులు దుర్గామాతకు సమర్పించిన చీరలను వేలం వేశారు. అమ్మవారి చీరలను సొంతం చేసుకునేందుకు మహిళలు ఉత్సాహంగా ముందుకొచ్చారు. ఒకరితో మరొకరు పోటీపడుతూ వేలంపాటలో పాల్గొని చీరలను కైవసం చేసుకున్నారు. మహిళల ఆసక్తి, పోటాపోటీ వేలంపాటతో కార్యక్రమం సందడిగా సాగింది.

లక్కీ డ్రాలో చేనేత పట్టు చీర, పట్టు శాలువా

అమ్మవారికి సమర్పించిన చేనేత పట్టు చీర, చేనేత పట్టు శాలువా కోసం ప్రత్యేకంగా లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో చేనేత పట్టు చీరను గోశిక కరుణాకర్,సుమతి దంపతులు చేనేత పట్టు శాలువాను పోలోజు వెంకటాచారి గెలుచుకున్నారు. లక్కీ డ్రా విజేతలను దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమ నిర్వహణకు తోడ్పడిన దాతలు, దుర్గామాత దీక్షా భక్తులు, మాతృమండలి సభ్యులు, భావనారుషి కళానికేతన్ సభ్యులు, పద్మశాలి యువజన సంఘం, చేనేత సహకార సంఘం, దేవస్థాన కమిటీ, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

దీపాల వెలుగుల్లో దీపావళి సందడి.. కొనుగోళ్లతో కళకళలాడుతున్న మార్కెట్లు


- ప్రమిదలు, దీపారాధన సామగ్రి, బాణసంచా కొనుగోళ్లలో ప్రజల ఉత్సాహం
- చెడుపై మంచి విజయానికి ప్రతీకగా దీపావళి



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : దీపావళి పండుగను పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ పరిసర ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది. పండుగకు అవసరమైన వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ప్రమిదలు, మట్టి దీపాలు, వత్తులు, నూనె, పూజా సామగ్రి, పూలు, పండ్లు, అలంకరణ వస్తువులను కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో దుకాణాలకు తరలివస్తున్నారు. ముఖ్యంగా మహిళలు దీపారాధనకు అవసరమైన సామగ్రిని ఆసక్తిగా కొనుగోలు చేస్తుండగా, చిన్నారులు, యువత బాణసంచా కొనుగోళ్లపై ఉత్సాహం చూపుతున్నారు. దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడితో వ్యాపారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. హిందూ పురాణాల ప్రకారం శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించి, 14 సంవత్సరాల వనవాసం ముగించుకుని అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని ప్రతీతి. అలాగే నరకాసురుడిని శ్రీకృష్ణుడు సంహరించిన విజయానికి గుర్తుగా కూడా దీపావళిని జరుపుకుంటారు. దీపావళి రోజున ప్రతి ఇంటిని శుభ్రం చేసి రంగురంగుల ముగ్గులు, విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. సాయంత్రం వేళ కుటుంబ సభ్యులు కలిసి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇళ్ల ముందు ప్రమిదల్లో నూనె లేదా నెయ్యి పోసి దీపాలు వెలిగిస్తారు. దీపాల వెలుగులతో ఇళ్లు, వీధులు కాంతులీనుతాయి. సంపద, సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని లక్ష్మీదేవిని ప్రార్థిస్తారు. బంధుమిత్రులతో కలిసి మిఠాయిలు పంచుకుంటూ ఆనందంగా పండుగను జరుపుకుంటారు. అయితే దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లో నాణ్యమైన బాణసంచా మాత్రమే కొనుగోలు చేయాలి. చిన్నారులు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలి. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, వాహనాలు నిలిపి ఉంచిన ప్రదేశాలు, విద్యుత్ తీగల సమీపంలో బాణసంచా కాల్చకూడదు. టపాసులు కాల్చే సమయంలో నీటి బకెట్, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి. పేలని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదు. శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావరణ హితంగా పండుగ జరుపుకోవాలి. పండుగ అంటే కేవలం దీపాలు వెలిగించడం, కొత్త వస్తువులు కొనుగోలు చేయడం, బాణసంచా కాల్చడం మాత్రమే కాదు.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంతోషాన్ని పంచుకోవడం, ఆపాయతలు పెంపొందించుకోవడం, పేదలకు సహాయం చేయడం కూడా పండుగలో భాగమే. వెలుగుల పండుగ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పండుగను ఆనందోత్సాహాలతో, సురక్షితంగా జరుపుకోవాలని పలువురు కోరుతున్నారు.

తొమ్మిదేళ్లుగా గంజాయి సామ్రాజ్యం...ఎట్టకేలకు చిక్కిన లేడీ డాన్

- ఆసిఫ్‌నగర్‌లో నీతూ భాయ్‌ను అరెస్ట్ చేసిన ఈగల్ బృందం




సైబరాబాద్ విశాల భారతి ; నగరంలో గంజాయి దందాను యథేచ్ఛగా కొనసాగిస్తూ కొన్నేళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న కలపాటి నీతూ భాయ్ ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడింది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ అండ్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) బృందం హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌లో ఆమెను అరెస్ట్ చేసింది. గత తొమ్మిదేళ్లుగా గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్న నీతూ భాయ్ ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆమెపై ఇప్పటికే 30కి పైగా కేసులు నమోదయ్యాయి. గత రెండేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఆమెపై ఈగల్ బృందం ప్రత్యేక నిఘా పెట్టి పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకుంది. అరెస్ట్ సమయంలో ఎలాంటి మత్తు పదార్థాలు లభించకపోయినా సుమారు రూ. లక్ష నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఆమె అక్రమ సంపాదన, మనీలాండరింగ్ వ్యవహారాలపై ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించడం కలకలం రేపింది.

ఎంబిబిఎస్ విద్యార్థినికి ఆర్థిక సహాయం

- దాస్ సేవా సమితి హైదరాబాద్

మునగాల' విశాల భారతి : మునగాల మండల కేంద్రంలో పేదరికంలో ఉన్న లంజపల్లి సౌజన్య తండ్రి నాగరాజు ఎం బి బి ఎస్ రెండవ సంవత్సరం చదవడానికి కాలేజీ ఫీజు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థినికి మునగాల వాస్తవ్యులు చిల్లంచర్ల ప్రభాకర్ గారు ఎస్. వెంకట రామిరెడ్డి (మాజీ సర్పంచ్ గుండ్లపల్లి మఠంపల్లి మండలం) గారి ద్వారా చెన్నూరు నర్సింగరావు (రిటైర్డ్ జిహెచ్ఎం గుండ్లపల్లి మఠంపల్లి మండలం) గారు తెలుసుకొని దాస్ సేవా సమితి చైర్ పర్సన్ గాయిత్రి గుప్తా గారికి వివరించగా సహృదయంతో విద్యార్థినికి సహాయం చేయాలని ఆలోచనతో కాలేజీ ఫీజు 135000 (ఒక లక్ష 35 వేల రూపాయలు) కాలేజీలో చెల్లించారు. విద్యార్థిని సౌజన్య మాటలతో... నా ఎంబీబీఎస్ చదువుకో రెండవ సంవత్సరం ఆర్థిక సమస్యను అర్థం చేసుకొని సహృదయంతో ఆర్థికంగా ఆదుకున్న దాసు సేవాసమితి చైర్పర్సన్ గాయత్రి గుప్తా మేడం గారికి చెన్నూరు నర్సింగరావు సార్ గారికి ఎస్ వెంకటరామిరెడ్డి మాజీ సర్పంచ్ (గుండ్లపల్లి మఠంపల్లి మండలం) గారికి, చిల్లం చర్ల ప్రభాకర్ గారికి నా ఎంబీబీఎస్ చదువులో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేస్తూ... నా ఎంబీబీఎస్ చదువు పూర్తయిన తర్వాత నాలాంటి పేద విద్యార్థులకు పేద ప్రజలకు సహాయంగా ఉంటానని తెలియజేస్తున్నాను.

సొమ్ల తండా గ్రామపంచాయతీలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు



మరిపెడ విశాల భారతి: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సొమ్ల తండా గ్రామ పంచాయతీ లో బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ రాణి సూచించారు. శుక్రవారం మరిపెడ మండలం సోమల తండా గ్రామపంచాయతీలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (వీసీపీసీ) ఏర్పాటు చేశారు. బాలల హక్కులకు భంగం కలగకుండా చూడటం, బాలల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయడం, బాలల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం గ్రామస్థాయి కమిటీ బాధ్యత అని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై వేధింపులు వంటి సమస్యల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో బాణాసంచా కాల్చడం నిషేధం

- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవు
- ఆదిభట్ల సీఐ రమేష్



విశాలభారతి ఇబ్రహీంపట్నం: దీపావళి పండుగ సందర్భంగా బహిరంగ ప్రదేశాలు, రహదారులపై బాణసంచా కాల్చడంపై నిషేధమని అన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు, దీపావళి పండుగ - 2026 సందర్భంగా ప్రజా శాంతి, భద్రత ప్రశాంత వాతావరణాన్ని కాపాడే ఉద్దేశంతో హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల పరిధిలోని బహిరంగ రహదారులు బహిరంగ ప్రదేశాలలో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించబడింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, బహిరంగ రహదారులు బహిరంగ ప్రదేశాలలో శబ్ద కాలుష్యాన్ని కలిగించే బాణసంచా కాల్చడంపై పూర్తిస్థాయి నిషేధం అమలులో ఉంటుంది. అయితే, రాత్రి 08:00 గంటల నుండి 10:00 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు.ఈ సమయంలో కూడా బాణసంచా, డప్పులు ఇతర వాయిద్యాల ద్వారా వెలువడే శబ్దం సుప్రీంకోర్టు కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశించిన అనుమతించదగిన పరిమితులకు మించకూడదని పేర్కొన్నారు. ఈ నిషేధ ఉత్తర్వులు 08112026 ఉదయం 06:00 గంటల నుండి 11112026 ఉదయం 06:00 గంటల వరకు అమలులో ఉంటాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం, 1348 ఫస్లీ (నెం. IX) ఇతర సంబంధిత చట్టాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలందరూ పోలీసుల ఉత్తర్వులను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా,పర్యావరణ హితంగా ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని ఆదిభట్ల పోలీస్ స్టేషన్ తరపున సీఐ ఎస్. రమేష్ కోరారు.

కేసీఆర్‌పై ప్రత్యేక గీతం ఆవిష్కరణ


- గాయని పవనిక ఆలపించిన పాటను ఆవిష్కరించిన
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి)



విశాల భారతి, ఇబ్రహీంపట్నం; తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం దాద్‌పల్లి గ్రామానికి చెందిన గాయని పి. పవనిక ప్రత్యేకంగా ఆలపించిన పాటను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాటను రూపొందించిన గాయని పవనికను అభినందించారు. కేసీఆర్‌పై అభిమానంతో ప్రత్యేక గీతాన్ని ఆలపించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అనితా వెంకటేష్ గౌడ్‌తో పాటు గ్రామ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్, వటినాలపల్లిలో నో బిన్ – నో ట్రేడ్ తనిఖీలు

- 50 దుకాణాల పరిశీలన.. రూ.7,700 జరిమానా విధింపు



రాజేంద్రనగర్,విశాల భారతి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్-45 పరిధిలో పరిశుభ్రతను మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టిన "నో బిన్ - నో ట్రేడ్" కార్యక్రమంలో భాగంగా శనివారం ఖానాపూర్, వటినాలపల్లి గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నార్సింగి సర్కిల్-45 మున్సిపల్ అధికారులు రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లోని వ్యాపార సముదాయాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మొత్తం 50 దుకాణాలను పరిశీలించారు. దుకాణాల వద్ద తప్పనిసరిగా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని అధికారులు వ్యాపారులకు సూచించారు. దుకాణాల పరిసరాల్లో చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాలని, పారిశుద్ధ్య నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలకు సంబంధించి మొత్తం రూ.7,700 జరిమానా విధించినట్లు అధికారులు వెల్లడించారు. వ్యాపారులు, ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరిస్తూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పరిశుభ్రమైన నార్సింగి సర్కిల్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నో బిన్ - నో ట్రేడ్.. పరిశుభ్రతే మన బాధ్యత అని అధికారులు స్పష్టం చేశారు.

DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

శంకర్ నాయకత్వంలో షాద్‌నగర్ అభివృద్ధి పరుగులు!

- గత పదేళ్లలో కాని పనులు.. ఇప్పుడు కార్యరూపం దాలుస్తున్నాయి
- ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం
- 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి



విశాల భారతి, షాద్‌నగర్: షాద్‌నగర్ నియోజకవర్గానికి వీర్లపల్లి శంకర్ లాంటి అంకితభావం కలిగిన ఎమ్మెల్యే దొరకడం ప్రజల అదృష్టమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి కొనియాడారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధి పనులు నేడు వేగంగా ముందుకు సాగుతున్నాయని, రహదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు శరవేగంగా పూర్తవుతున్నాయని పేర్కొన్నారు.ఎమ్మెల్యే శంకర్ ఉదయం నుంచే ప్రజల్లో ఉంటూ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నాయని, ఎల్ 3 జాబితాలోని సాంకేతిక సమస్యలను పరిష్కరించి మరింత మందికి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

22ఏ సమస్యకు పరిష్కారం చూపాలి

రైతులు, సామాన్యులు ఎదుర్కొంటున్న రెవెన్యూ 22ఏ నిషేధిత జాబితా సమస్యపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమస్యపై సమగ్ర విచారణ జరిపించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో సన్నబియ్యం, నాణ్యమైన పౌష్టికాహారం అందించడం, ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టడం భావితరాలకు గొప్ప భరోసా అని ప్రతాపరెడ్డి ప్రశంసించారు.

కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాచలం : విశాల భారతి; భద్రాచలం పట్టణంలోని రైతు వేదిక వద్ద భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన 36 చెక్కులతో పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అందజేశారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ , వార్డు సభ్యులు, ఎమ్మార్వో రవికుమార్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్మార్ట్ రేషన్ కార్డుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్..
- ఇంటి తాళం,బీరువా, లాకర్ పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాల చోరీ
- సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న షాద్‌నగర్ పోలీసులు
- చోరీ సొత్తు స్వాధీనం.. నిందితుడికి రిమాండ్



విశాల భారతి, షాద్‌నగర్: రాత్రి వేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించి, నిందితుడి నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.షాద్ నగర్ సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం షాద్‌నగర్‌లోని ఈశ్వర్ కాలనీకి చెందిన రమేష్‌వాంకుడోతు సెప్టెంబర్ 29న తన మేనమామ అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులతో కలిసి అదే రోజు రాత్రి 9 గంటల 15 నిమిషాల సమయంలో ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి వెళ్లారు. అక్టోబర్ 2 వ తేదీన ఆసుపత్రికి అవసరమైన సామానులు తీసుకోవడానికి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో పాటు బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేసిన పోలీసులు శనివారం రాజేంద్రనగర్ పరిధిలోని హుడా కాలనీ,అత్తాపూర్ వద్ద నిందితుడు జగనాథ ప్రభు (32)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అక్టోబర్ 1వ తేదీ అర్ధరాత్రి ఈశ్వర్ కాలనీలోని తాళం వేసి ఉన్న ఇంటి ప్రహరీ దూకి లోపలికి ప్రవేశించి, ఐరన్ రాడ్‌తో ఇంటి తాళం, బీరువా, లాకర్ పగలగొట్టి ఆభరణాలు దొంగిలించినట్లు అంగీకరించాడు.నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు..ఈ సమావేశంలో డీఎస్ఐ శివరెడ్డి తదితరులున్నారు..

దీపావళి కానుకలు పంపిణీ చేసిన నల్లగొప్పుల హరీష్ గౌడ్



రాజేంద్రనగర్, విశాల భారతి : దీపావళి పండుగను పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 123వ డివిజన్ హైదర్షాకోట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నల్లగొప్పుల హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులను పండుగ వేళ గుర్తించి, వారితో ఆనందాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు నూతన దుస్తులు, స్వీట్లు అందజేశారు. పండుగ సందర్భంగా తమకు అందించిన కానుకలతో పారిశుద్ధ్య కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. రోజంతా విధుల్లో నిమగ్నమై ఉండే తమను గుర్తించి, ఆప్యాయంగా పలకరించి పండుగ కానుకలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లగొప్పుల హరీష్ గౌడ్ మాట్లాడుతూ..నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఎండనక, వాననక, చలి, దుమ్ము, ధూళిని సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచి రాత్రి వరకు తమ విధులను బాధ్యతగా నిర్వహిస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు వారు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికుల కష్టం, శ్రమ లేకుండా నగర పరిశుభ్రత సాధ్యం కాదని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, ఆ పరిశుభ్రత వెనుక నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సేవలను గుర్తించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అర్థం చేసుకొని, వారికి తగిన గౌరవం, ఆత్మీయత అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పారిశుద్ధ్య కార్మికులు కేవలం ఉద్యోగులు మాత్రమే కాదని, మన సమాజంలో అంతర్భాగమని, వారిని మన కుటుంబ సభ్యులుగా భావించాలని సూచించారు. దీపావళి వంటి పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, వెలుగులు నింపాలని, ఆ ఆనందం సమాజంలోని అన్ని వర్గాల వారికి అందాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ప్రజల కోసం నిరంతరం కష్టపడే పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాల్లో కూడా పండుగ సంతోషాలు వెల్లివిరియాలనే ఉద్దేశంతో దుస్తులు, స్వీట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇది పెద్ద కానుక కాకపోయినా, వారి పట్ల తమకున్న అభిమానం, గౌరవం, ఆత్మీయతకు గుర్తుగా అందిస్తున్న చిన్న కానుక అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ పారిశుద్ధ్య కార్మికులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ, వారి సంక్షేమానికి కృషి చేస్తానని హరీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య కార్మికుల పట్ల గౌరవాభిమానాలను చాటడంతో పాటు పండుగ సంతోషాలను వారితో పంచుకున్నారు.

నందిగామ అభివృద్ధికి నూతన అధ్యాయం

- ఒకే పర్యటనలో అభివృద్ధి పనుల జాతర
- ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాల
- పలు ప్రభుత్వ భవనాలు ప్రారంభం
- రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి





విశాల భారతి,షాద్‌నగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శనివారం నందిగామ మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేశారు.

తిమ్మాపూర్ వద్ద ఘన స్వాగతం

మంత్రి పర్యటన సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గ సరిహద్దులోని తిమ్మాపూర్ వద్ద ఘన స్వాగతం లభించింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్ దంపతులు, మాజీ జెడ్పీటీసీ విశాల శ్రావణ్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు.

ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు

నందిగామ గ్రామంలో ఇద్దరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి పాల్గొని నూతన గృహాలను ప్రారంభించారు. అనంతరం మహిళా సమాఖ్య భవనం, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని, గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ దీపాలను మంత్రి ప్రారంభించారు. అలాగే నందిగామ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సైతం ప్రారంభించారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు అందుబాటులోకి రావడంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయి.


రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

అనంతరం నందిగామలో తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. పాత జాతీయ రహదారి 7 నుంచి నందిగామ మీదుగా నర్సప్పగూడ గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒకే పర్యటనలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, పలు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు, కొత్త భవన నిర్మాణాలు, రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగడంతో నందిగామ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత లభించింది.

శంషాబాద్ జోన్‌లో మున్సిపల్ కార్మికుల వేతనాల్లో అక్రమ కోతలు నిలిపివేయాలి

- ఒక్కో కార్మికుడి నుంచి రూ.200 ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూలు చేయడం సరికాదు





T.G MUNICIPAL STAFF & CONTRACT OUTSCURCING WORKER UNION
(Regd.No:H-130/2026/TG Affiliated To AITUC)
Telangana State Council
H.NO : 3-5-192, 3rd Floor, S.N.Reddy Bhavan, Himayat Nagar, Hyd - 500029

K. YESURATNAM
STATE PRESIDENT
CELL.NO : 9886651682

VANAMPALLI JAIPAL REDDY
STATE GENERAL SECRETARY
CELL.NO : 9573982349

శ్రీయుత గౌరవనీయులైన
జోనల్ కమిషనర్ గారికి
శంషాబాద్ జోన్
గ్రేటర్ హైదరాబాద్

Date : 07 || 11 || 2026

విషయం: పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శంషాబాద్ జోన్ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు రూ.17748 లు, కార్మికుని వేతనం నుండి వారి యొక్క ఈఎస్ఐ,ఈపీఎఫ్ శాతం రూ. 2263 లు, ప్రొఫెషనల్ టాక్స్ (PT) ఒక గ్రూపులో 7 మంది కార్మికులు ఉంటారు ఒక్కొ గ్రూపుకు 200 రూపాయలు కట్ చేయాలి అంటే ఒక కార్మికునికి 29 రూపాయలు మాత్రమే కార్మికులకు అన్ని కటింగ్ పోను 15455 రూపాయలు ఇవ్వాలి.

శంషాబాద్ జోన్ పరిధిలో కార్మికులకు ప్రొఫెషనల్ టాక్స్ (PT) ఒక్క కార్మికుని నుండి 200 రూపాయలు కట్ చేస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే విధమైన వేతనాలు అమలు చేయాలి.

జీహెచ్ఎంసి కమిషనర్ కార్మికులందరికి సంవత్సరానికి 15 క్యాజువల్,8 జాతీయ పండుగ సెలవులు అమలు చేస్తామని సర్క్యులర్ నెంబర్:1906/LW/B1/GHMC/2026-256, తేది:19-06-2026 రోజు ఆదేశాలు జారీ చేయడం జరిగింది శంషాబాద్ జోన్ పరిధిలోని కార్మికులందరికీ అమలు పరచాలి.

శంషాబాద్ జోనల్ కార్యాలయంలో కమిషనర్ గారు లేకపోవడంతో ఇన్వార్డ్ లో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం జోనల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ గారిని కలిసి మాట్లాడడం జరిగింది.సూపరింటెండెంట్ గారుఈ నెల నుండి కచ్చితంగా 7 మంది ఒక గ్రూపుకు 200 రూపాయలు మాత్రమే కట్ చేస్తాము అన్నారు.

రాజేంద్రనగర్, విశాల భారతి : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శంషాబాద్ జోన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వేతనాల్లో నిబంధనలకు విరుద్ధంగా కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో కార్మికులకు ఒకే విధమైన వేతనాలు, సెలవుల విధానాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్ జోన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.17,748 చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఇందులో కార్మికుల వాటాగా ఉద్యోగుల భవిష్య నిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం కింద రూ.2,263, వృత్తి పన్ను మినహాయించాల్సి ఉంటుందని వివరించారు. ఒక గ్రూపులో ఏడుగురు కార్మికులు ఉంటారని, ఆ గ్రూపునకు కలిపి రూ.200 వృత్తి పన్ను కోత విధిస్తే ఒక్కో కార్మికుడికి సుమారు రూ.29 మాత్రమే అవుతుందని పేర్కొన్నారు. అయితే శంషాబాద్ జోన్‌లో ఒక్కో కార్మికుడి వేతనం నుంచి రూ.200 వృత్తి పన్ను కట్ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం అన్ని కోతలు పోను కార్మికులకు రూ.15,455 వేతనం అందించాలని కోరారు. అలాగే జీహెచ్ఎంసీ కమిషనర్ సర్క్యులర్ నంబర్ 1906/LW/B1/GHMC/2026 256, తేదీ 19062026 ప్రకారం కార్మికులకు సంవత్సరానికి 15 సాధారణ సెలవులు, 8 జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తుచేశారు. ఈ సెలవుల సౌకర్యాన్ని శంషాబాద్ జోన్ పరిధిలోని కార్మికులందరికీ కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై శంషాబాద్ జోనల్ కార్యాలయంలో కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఇన్‌వార్డులో వినతిపత్రం సమర్పించారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌ను కలిసి కార్మికుల వేతనాల కోతల విషయాన్ని వివరించారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ ఈ నెల నుంచి ఏడుగురు కార్మికులు ఉన్న ఒక్కో గ్రూపునకు రూ.200 మాత్రమే వృత్తి పన్ను కింద కోత విధిస్తామని హామీ ఇచ్చినట్లు వనంపల్లి జైపాల్ రెడ్డి తెలిపారు. కార్మికులకు న్యాయంగా అందాల్సిన వేతనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు

- 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దిశానిర్దేశం



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లలో వెలిగే ప్రతి దీపం ప్రజాప్రభుత్వ సంకల్పానికి, పేద ప్రజల జీవితాల్లో వస్తున్న మార్పునకు ప్రతీకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని శనివారం తొర్రూర్‌లోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలతో ఎమ్మెల్యే వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు. పేద ప్రజల చిరకాల స్వప్నమైన సొంతింటి కల సాకారమవుతున్న వేళ ప్రతి లబ్ధిదారుడి కుటుంబంలో పండుగ ఆనందం వెల్లివిరియాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది, ఇందిరమ్మ కమిటీల సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లోని ఇందిరమ్మ ఇళ్ల వద్ద నిర్వహించే దీపావళి వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పూర్తయిన ప్రతి ఇందిరమ్మ ఇంటికి స్టిక్కర్ వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక నుంచి బిల్లుల చెల్లింపుల వరకు ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా పనులు కొనసాగించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు వారి ఇళ్లలో పండుగ వెలుగులు నింపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు.

డిండి ఎత్తిపోతలను రద్దు చేయాలి



విశాల భారతి ; డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు అధ్యయన వేదిక కల్వకుర్తి డివిజన్ కన్వీనర్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. డిండి ఎత్తిపోతల పథకం(డీఎల్ఐ)తో ఉమ్మడి పాలమూరు జిల్లాకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఏదులడిండి ఎత్తిపోతలకు నీటిని తరలించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.

పాఠశాలలో ఘనంగా దీపావళి సంబరాలు

- చీకటిని పారదోలి వెలుతురులోకి ప్రవేశించడమే దీపావళి పండుగ విశిష్టత
- పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి



చౌటుప్పల్,విశాలభారతి: చౌటుప్పల్ లోని విశాల భారతి హైస్కూల్ లో దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగలో భాగంగా లక్ష్మీదేవి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... దీపావళి పండుగ విశిష్టతను వివరించారు. శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి నరక చతుర్దశి రోజు నరకాసురుని సంహరించారని, ఆ రోజు నుండి చీకటిని పారదోలి వెలుతురులోకి ప్రవేశించడంలో భాగంగా దీపావళి పండుగను జరుపుకుంటారని తెలిపారు. అజ్ఞానాన్ని, చీకటిని, అచంచలాన్ని, స్వార్థాన్ని పారద్రోలి జ్ఞానోదయం కలగాలని, చిన్నపిల్లల హృదయాలు జ్ఞానంతో నిండిపోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

- దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజలు
- దేవాలయ ట్రస్టీ శశికళ ఆహ్వానం మేరకు హాజరు



విశాల భారతి, ఎల్బీనగర్ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని చార్మినార్‌లోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. దేవాలయ ట్రస్టీ శశికళ ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న ఆయన భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. దీపావళి పర్వదినం సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం మాజీ ధర్మకర్త మధుసాగర్, లోహిత్, చందు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీమ్ డెంటల్ కేర్ ఆసుపత్రి ప్రారంభోత్సవం

- ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి



విశాల భారతి, ఎల్బీనగర్ : ఎల్బీనగర్ నియోజకవర్గం బైరామల్‌గూడలోని దుర్గానగర్ రోడ్ నంబర్ 5లో చిలువేరు అశోక్ కుమారుడు డాక్టర్ మనోజ్ కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన స్ట్రీమ్ డెంటల్ కేర్ (STREAM Dental Care) ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ మనోజ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ప్రారంభమైన డెంటల్ కేర్ ఆసుపత్రి ద్వారా స్థానిక ప్రజలకు నాణ్యమైన దంత వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చారకొండ మండల సీపీఐ సీనియర్ నాయకులు డాక్టర్ చిలువేరు శ్రీను, చిలువేరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి.. మళ్లీ కిడ్నీల పనితీరు సాధారణ స్థితికి!



విశాల భారతి, షాద్‌నగర్: రెండు కిడ్నీలు పనిచేయక అపస్మారక స్థితిలో ఆసుపత్రికి చేరుకున్న 60 ఏళ్ల వ్యక్తికి మెరుగైన వైద్య చికిత్స అందించి తిరిగి ఆరోగ్యవంతుడిగా ఇంటికి పంపించారు శంషాబాద్ తొండుపల్లిలోని లిమ్స్ కార్డియాక్ అండ్ న్యూరో ఆసుపత్రి వైద్యులు. షాద్‌నగర్‌కు చెందిన అంజయ్య అనే వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరుకోగా, వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించి కిడ్నీల పనితీరు తిరిగి మెరుగుపడేలా చేశారు.వివరాల్లోకి వెళితే.. షాద్‌నగర్‌కు చెందిన అంజయ్య (60) సుమారు 25 రోజుల క్రితం రెండు కిడ్నీలు దెబ్బతినడంతో స్థానికంగా పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. అయినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో అపస్మారక స్థితిలో తొండుపల్లిలోని లిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించగా,ఒక కిడ్నీలో రాళ్లు ఉండటంతో పాటు మరో కిడ్నీ కూడా దెబ్బతిన్నట్లు గుర్తించారు. పరిస్థితిని అంచనా వేసిన వైద్య బృందం తగిన చికిత్స అందించడంతో క్రమంగా కిడ్నీల పనితీరు మెరుగుపడి అంజయ్య కోలుకున్నారు. పూర్తిగా ఆరోగ్యం కుదుటపడటంతో శనివారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. తాను ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వచ్చినప్పటికీ లిమ్స్ వైద్యులు, సిబ్బంది అందించిన ప్రత్యేక వైద్య సేవలతో తిరిగి ఆరోగ్యంగా కోలుకున్నానని తెలిపారు. తనకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన వైద్యులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా లిమ్స్ వైద్యులు మాట్లాడుతూ.. కిడ్నీల సమస్యలను ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అంజయ్య గతంలో డయాలసిస్ చేయించుకున్నప్పటికీ, సమస్యకు గల అసలు కారణాలను గుర్తించి అవసరమైన పరీక్షల అనంతరం తగిన చికిత్స అందించామని తెలిపారు. కిడ్నీల పనితీరు దెబ్బతిన్న ప్రతిసారీ డయాలసిస్ ఒక్కటే మార్గం కాదని, సమస్యను ముందుగానే గుర్తించి సరైన సమయంలో వైద్యులను సంప్రదిస్తే కొన్ని సందర్భాల్లో కిడ్నీల పనితీరును మెరుగుపరిచే అవకాశం ఉంటుందని వివరించారు.కిడ్నీ సంబంధిత లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.

తొలి రోజే షాకింగ్ కలెక్షన్లు, నయనతారకు నిరాశేనా?

లేడీ సూపర్‌స్టార్ నయనతార ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మూకుత్తి అమ్మన్ 2' బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆరంభం అందుకోలేకపోయింది. తెలుగులో 'మహాశక్తి' పేరుతో విడుదలైన ఈ భక్తిరస ఫాంటసీ చిత్రం నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి భాగం మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో రెండో భాగంపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే విడుదలైన తొలి రోజే ఈ సినిమా వసూళ్లు నిరాశపరిచినట్లు ట్రేడ్ వర్గాల అంచనాలు వెల్లడిస్తున్నాయి. 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రాన్ని మొదటి భాగంతో పోలిస్తే భారీ స్థాయిలో తెరకెక్కించారు. కథ, విజువల్స్, నిర్మాణ విలువల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్ కేటాయించారు. ఈ సినిమా నిర్మాణానికి రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే ఇంత భారీ వ్యయంతో రూపొందిన సినిమా ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు కేవలం రూ.3 కోట్ల గ్రాస్ మాత్రమే వసూలు చేసినట్లు ట్రేడ్ నివేదికలు చెబుతున్నాయి.భారీ బడ్జెట్ సినిమాకు ఈ స్థాయి ఓపెనింగ్ ఆశించిన ఫలితం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా నయనతారకు ఉన్న క్రేజ్, సినిమా ప్రచారం, మొదటి భాగానికి ఉన్న గుర్తింపు దృష్ట్యా మంచి వసూళ్లు వస్తాయని భావించారు. కానీ తొలి రోజు వసూళ్లు మాత్రం అంచనాలను అందుకోలేకపోయాయి. 'మూకుత్తి అమ్మన్' మొదటి భాగానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. ఆధ్యాత్మిక అంశాలను వినోదంతో కలిపి తెరకెక్కించిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందింది. అయితే రెండో భాగం బాధ్యతలను ప్రముఖ దర్శకుడు సుందర్ సి చేపట్టారు. ఆయన దర్శకత్వంలో భారీ స్థాయిలో ఈ సీక్వెల్‌ను రూపొందించారు. నయనతార మరోసారి అమ్మవారి పాత్రలో కనిపించగా, ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా, దునియా విజయ్, ఊర్వశి, అభినయ, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రౌడీ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ప్రస్తుతం 'మహాశక్తి' చిత్రానికి బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడం కీలకంగా మారింది. తొలి రోజు వచ్చిన వసూళ్లతో పోలిస్తే శని, ఆదివారాల్లో కలెక్షన్లు గణనీయంగా పెరగాల్సి ఉంది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.